

రాయచోటి నుంచి సంబేపల్లి పాఠశాల వరకు వచ్చే ఆర్‌టీసీ బస్సును రౌతుకుంట వరకు పొడిగించాల్సిందిగా రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతి ఇస్తున్న ఆదర్శపాఠశాల సిబ్బంది.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 11 జూలై 2024


## విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె, జూలై 10, ప్రభాతవార్త ః



ప్రతి కార్మికుడు విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 18రకాల చేతివృత్తిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వేంపల్లె నుండి 150మంది వరకు ఉచిత శిక్షణ పొందారని, త్వరలో వీరికి పనిముట్లను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. అలాగే ఉపాధి కోసం రూ.లక్ష వరకు రుణసౌకర్యం కల్పిస్తుందన్నారు. ఉపాధి పొందేందుకు ప్రతి కార్మికుడు విశ్వకర్మ యోజన పథకాన్ని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చిన్నపయ్య, సిద్దయ్య, లక్ష్మణ, నరసింహులు, షకూర్, మహమ్మద్‌బాష, దేవరాజు, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణస్థాయి నుండి క్రీడాకారులను వెలికితీస్తాం

- ప్రతి రూపాయికి జవాబుదారితనం తెదేపా విధానం
- లక్షలాది క్రీడాకారులతో ఆడుకున్న వైకాపా
- నకిలీ సర్టిఫికెట్ల విధానాన్ని అరికడతాం
- నిబద్ధతతో చేసేవారికి ప్రభుత్వం చేయూత
- ఆడుదాం ఆంధ్రతో రూ.130కోట్లు నీళ్లపాలు
- సౌత్‌జోన్ హాకీ క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి




పులివెందుల, జూలై 10, ప్రభాతవార్త ః

గ్రామీణస్థాయి నుండి ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసి జాతీయస్థాయిలో రాష్ట్రానికి పేరు, ప్రఖ్యాతలు తెచ్చేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణాశాఖ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో రెండవ సౌత్‌జోన్ హాకీ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి తయారు చేస్తామని తెలిపారు. పిల్లలకు చదువు మాత్రమే కాకుండా క్రీడలు ఆడించడం పట్ల కూడా తల్లిదండ్రులు ఆసక్తి చూపించాలని కోరారు. రాష్ట్రంలోని అన్నిశాఖల్లోను ఖర్చు పెట్టే ప్రతి రూపాయికి జవాబుదారితనం ఉంటుందని, ఇది తెదేపా ప్రభుత్వ లక్ష్యం, విధానమన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లు క్రీడలపై చిన్నచూపు చూసిందన్నారు. లక్షల మంది క్రీడాకారుల జీవితాలతో, వారి భవిష్యత్తుతో ఆడుకుందన్నారు. ప్రభుత్వ సహాయం లేకుండా హాకీ సమాఖ్య ఆధ్వర్యంలో ఇటువంటి మెగా టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి అన్నిశాకలను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. నేను జరిపిన శాప్ సమావేశంలో ఆసక్తికర విషయం బయట పడిందన్నారు. అదేమిటంటే వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలన ముగుస్తుందనుకున్న సమయంలో కేవలం 44 రోజుల్లో ఆడుదాం ఆంధ్ర అనే పేరుతో రూ.130కోట్ల నిధులను నీళ్లపాటు చేసిందన్నారు. క్రీడా కిట్లను కొనడానికి రూ.44కోట్లు, టీషర్డులు, టోపీలు కొనేందుకు రూ.30కోట్లు, భోజనాలకు రూ.4కోట్లు ఇలా రూ.130కోట్లను 44 రోజుల్లోనే ఖర్చు చేశారంటే ఏ మేరకు క్రీడలపై అభిమానం ఉందో అర్థం అవుతోందన్నారు. ఆ రూ.130కోట్లను ఏదైనా క్రీడాకారులపై ఖర్చు పెట్టి ఉంటే బాగుండేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది బడ్జెట్‌లో క్రీడలకు రూ.25వేల నుండి రూ.30వేల కోట్ల వరకు ఖర్చు పెడుతోందని, రాష్ట్రానికి రావల్సిన నిధులను కేంద్రం నుండి విడుదల చేయించి మన రాష్ట్రంలో ప్రతి క్రీడలో నైపుణ్యమైన కోచ్‌లను పెట్టి క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి జాతీయ క్రీడల్లో రాష్ట్ర ప్రతిష్ట పెంపొందేలా చేస్తామన్నారు. అందుకు నిదర్శనం గత ఏడు నెలలుగా కోచ్‌లకు కూడా వైకాపా ప్రభుత్వం ఏడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈరోజు ఏడు నెలల బకాయిలను 22 మందికి జమ చేయడం జరిగిందని మంత్రి వివరించారు. ఇది మా ప్రభుత్వానికి క్రీడలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం అన్నారు. అలాగే క్రీడారంగంలో నకిలీ సర్టిఫికెట్లపై ఉద్యోగాలు సంపాదించిన వారిని గుర్తించి, అలాగే నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసే వ్యవస్థను కూడా అరికడతామని తెలిపారు. త్వరలో కమిటి వేసి నకిలీ విధానాన్ని రూపు మాపుతామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను తయారు చేయడమే మా ప్రాధాన్యత అన్నారు. భవిష్యత్తులో ప్రతి ఈవెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులతోనే చేయడం జరుగుతుందన్నారు. పులివెందుల స్టేడియానికి సంబంధించి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

**– క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి**

ప్రతి క్రీడాకారుడు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. సౌత్‌జోన్ జాతీయస్థాయి హాకీ క్రీడాపోటీల ప్రారంభానికి అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పులివెందుల గ్రామీణ ప్రాంతంలో బేస్‌బాల్, పట్టణ ప్రాంతంలో హాకీ క్రీడలకు ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలు కూడా వస్తాయని అన్నారు. పులివెందుల ప్రాంతంలో ప్రతిభ కలిగిన ప్రతి క్రీడాకారుడికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

**– హాకీతో పులివెందులకు విడదీయరాని బంధం**

**ః మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి**

పులివెందుల నుండి హాకీ క్రీడను వేరు చేయలేమని, విడదీయరాని అనుబంధం కలిగి ఉందని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. సౌత్‌జోన్ హాకీ క్రీడల ప్రారంభానికి విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిలో వెనుకబడి ఉన్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని క్రీడలకు సంబంధించిన క్రీడా మైదానాలను విరివిగా ఏర్పాటు చేసి మౌలిక వసతులను కల్పించి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి వాటికే ప్రాధాన్యత ఇవ్వకుండా క్రీడల పట్ల కూడా ప్రాధాన్యత చూపాలన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పులివెందుల క్రీడారంగ అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు. అనంతరం హాకీ సమాఖ్య నాయకులు, అతిథులు ప్రసంగించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. క్రీడాజ్యోతిని వెలిగించి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. స్వయంగా హాకీ క్రీడను ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సీఈవో నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చాణిక్యరాజు, జనరల్ సెక్రెటరీ హర్షవర్ధన్, హాకీ కడప ప్రెసిడెంట్ రవిచంద్ర, సెక్రెటరీ శేఖర్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి బాలుర, బాలికల జట్ల కోచ్‌లు, మేనేజర్లు దాదాపు 250మంది పాల్గొన్నారు.









# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిపై కలెక్టర్ ఆగ్రహం
- మధ్యాహ్నం భోజనంలో ఉడకని బంగాళదుంప కూర వడ్డించడంపై కలెక్టర్ ఆగ్రహం







కాశినాయన, జూలై 10, ప్రభాతవార్త

పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి 100 శతం ఫలితాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం శ్రీ అవదూత కాశినాయన మండలం, నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరి హెల్త్ సెంటర్, తహసీల్దార్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్లను మండలం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నరరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బాల ఓబయ్య బోధించే బయాలజికల్ సైన్స్ క్లాసులో విద్యార్థుల మధ్యలో కూర్చుని ఆయన బోధించే పాఠ్యబోధనను విన్నారు. ఆ ఉపాధ్యాయుడు సరిగ్గా చెప్పడం లేదని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ముందుగా పూర్తిగా ప్రిపేర్ అయి రావాలి కదా, ఇలా చేస్తే విద్యార్థులకు ఏమి అర్థం అవుతుందని సంబంధిత ఉపాధ్యాయుడుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బోధించు ముందు ఉపాధ్యాయులందరూ పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై ముందస్తుగా ప్రిపేర్ అయ్యి విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి జీవిత ఆశయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిర్వరామంగా కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచిస్తూ, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం స్వయంగా ఆయన పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశరు. బంగాలాదుంప కర్రి సరిగా ఉడకలేదని సంబంధిత ఇన్‌చార్జిలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశరు. ఇప్పటి నుండి పద్దతులు మార్చుకుని పిల్లలకు అందించే భోజనంలో మంచి ఆహారం అందించకపోతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టాఫ్‌రూంలో టీచర్‌లతో సమావేశమై పాఠశాలలో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లను సందర్శించి అక్కడ పనిచేసే సిబ్బందికి తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలను ఆలస్యం లేకుండా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూలు హెడ్మాస్టర్, మండల రెవెన్యూ అధికారి, మండల విద్యాధికారి, పంచాయతి కార్యదర్శి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## డయేరియా ప్రబలకుండా పటిష్టంగా

# నివారణా చర్యలు తీసుకోవాలి

– ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందాలి

– జిల్లా వ్యాప్తంగా వంద శాతం ఇమ్యూనైజేషన్ జరగాలి

– జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, జులై 10, ప్రభాతవార్త:

జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో డయేరియా ప్రబలకుండా పటిష్టంగా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో డయేరియా నివారణ చర్యలు, జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, ఇమ్యునైజేషన్, డెటా ఎంట్రీ అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ మండల వైద్యాధికారులు, సీహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు,ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలో డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఆశా కార్యకర్త వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం చేతులు పరిశుభ్రత గురించి తాగునీటి కలుషితం లేకుండా చూడడం, పిల్లలకు డయేరియా వస్తే వెంటనే జింక్ మాత్రలు సరఫరా చేయడం తప్పనిసరి అన్నారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వైద్య శాఖకు ఏపే బాధ్యతలు అప్పగించింది అందులో మన పనితీరు ఎంత అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఎంహెచ్ఓ డా.కె.కొండయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జిల్లా మలేరియా అధికారి, డీపీఎంఓ, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాటుదాం...నరికేద్దాం...



**మదనపల్లె, జులై 10 ప్రభాతవార్త :**

మదనపల్లె మండలంలోని రోడ్డువైపున, గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం కోసం అధికారులు చేస్తున్న హడావుడి ఇంతాకాదు. మొక్కలను నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాలు అంతా ఇంతాకాదు. లక్షలాది రుపాయలు వెచ్చిస్తున్నారు. కానీ ఆశించిన స్థాయిలో ఫలితం మాత్రం కనిపించడం లేదు. గడిచిన సంవత్సరాల్లో లక్షలాది మొక్కలు నాటారు. ఇంత మొత్తం పెద్దసంఖ్యలో మొక్కలు నాటితే మండలమంతా పచ్చదనంతో కనిపించాల్సి ఉండగా, ఎక్కడా కూడా పచ్చదనం కనిపించడం లేదు. పచ్చదనం పెంచే విషయంలో కీలకశాఖలైన పంచాయితీ, ఆర్అండ్‌బి శాఖలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ, ప్రైవేటు శాఖలతో పాటు విద్యాసంస్థలు అందరూ భాగస్వామ్యం అవుతున్నారు. పచ్చదనం కోసం ఎంతో శ్రమించి మొక్కలు నాటుతున్నారు. మొక్కలు నాటే ముందు ఫోటోలు దిగి వెళ్ళిపోతున్నారు. ఆ తరువాత మొక్కలు బతికాయా? లేదా అన్న అంశాలను పట్టించుకోవడం లేదు. దీంతో మొక్కలు లెక్కలకు మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పవచ్చు. పచ్చదనం కోసం మొక్కలు నాటడమేకాదు.ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నామని అంటున్నారు. ఇది ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. మండలంలోని బస్టాండు, రోడ్లుకు ఇరువైపులా ఎక్కడ చూసినా చెట్లు నరికివేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని జరిమానా విధించిన దాఖలాలు కనిపించడం లేదు. మునుపు ఏ గ్రామానికి వెళ్లిన 10నుంచి 20 చెట్టులు వరకు కనపడేవి. ఇప్పుడు ఒక్కచెట్టు కనిపంచలేదంటే ఆశ్చర్యం వేస్తోంది. మొక్కలు నాటితున్న దాఖలాలు లేవు. పొరపాటున నాటినా సంరక్షించేవారు కరువయ్యారు. మొక్క నాటిన వెంటనే సంరక్షించకపోవడంతో ఎండకు ఎండిపోవడమో, ఏదో ఒక మేక, గొర్రె, ఆవు వంటి జంతువులు తినేయడం జరుగుతోంది. ఉన్నవాటిని కూడా రక్షించడమూ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకటనలకు మాత్రమే మొక్కలు నాటుతున్నారని చెప్పవచ్చు. ఇకపోతే రోడ్డులోని కరెంటు లైన్లకు అడ్డంగా ఉన్నాయని వ్యాపార సముదాయాలకు అడ్డంగా ఉన్నాయని, బిల్డింగ్ నిర్మించుకోవాలని చెట్టుకను నరికివేయాలని ఇలా పలు రకాలుగా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను సైతం కోతకు గురిచేస్తున్నారు. మొక్కలునాటేది తక్కువ..వృక్షాలను నరికివేసేది ఎక్కువ..అంటూ ప్రజలు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంలో అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారన్న



ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కలు నాటుతాం..పచ్చదనాన్ని చేస్తామంటూ ప్రకటనలు జారీ చేస్తున్నారు. ఇక పోతే విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్నాయంటూ విద్యుత్ అధికారులు కొమ్మలు కోయాల్సిన చోట వృక్షం మొదళ్ళ వరకు నరికేస్తున్నారు. కొమ్మలు మాత్రం నరకాల్సి ఉంటుందని తెలియదో లేక మామూళ్ళు తీసుకొని వృక్షం మొదళ్ళకు కోత విధిస్తున్నారో అధికారులకే తెలియాలి. వైర్లకు అడ్డంగా ఉండి, ఇబ్బంది కరంగా ఉన్నవాటిని నరకడంలో ఇబ్బంది లేకపోయినా నరికే క్రమంలో పచ్చదనం గురించి ఆలోచించకపోవడం విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మొక్కలు నాటడంపై ఉన్న శ్రద్ధ నాటిని మొక్కలను పరిరక్షించకపోవడం, ఉన్నచెట్లపై దృష్టి సారించకపోవడంతో పచ్చదనం కరువైందని చెప్పవచ్చు. ఏది ఏమైనా ఇప్పటి కైనా సంబంధిత అధికారులు వృక్షాల నరికివేత విషయంలో ఆలోచించాల్సిన విషయం ఎంతైనా ఉంది.

## కడప జిల్లా మైనార్టి ప్రధాన కార్యదర్శిగా ముల్ల ఫయాస్‌బాష



**వేంపల్లె, జూలై 10, ప్రభాతవార్త ః**

కడప జిల్లా మైనార్టి ప్రధాన కార్యదర్శిగా ముళ్ల ఫయాజ్ బాషాకు పదోన్నతి లభించింది. ఇదివరకు వేంపల్లె మండల ప్రధాన కార్యదర్శిగా ఈయన పనిచేసేవారు. ఈయనకు జిల్లా మైనార్టి ప్రధాన కార్యదర్శిగా పదవి రావడంతో పలువురు అభినందనలు తెలిపారు. ఈ మేరకు వేంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టి అధ్యక్షుడు ఖాదర్‌బాషా, వేంపల్లె మండల కన్వీనరు రామమునిరెడ్డి, మండల మైనార్టి ప్రధాన కార్యదర్శి షరీఫ్, డాక్టర్ కరిముల్లా, సయ్యద్‌పీరా, మస్తాన్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

**పులివెందుల రూరల్, జూలై 10, ప్రభాతవార్త ః**



చిరుధాన్యాలతోనే ఆరోగ్యం సమకూరుతుందని మిల్లెట్స్ హోటల్ నిర్వాహకులు తెలిపారు. పులివెందులలో బుధవారం మిల్లెట్స్ హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివ మాట్లాడుతూ నేటి సమాజానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు జంక్ ఫుడ్ తినడం వలన రోగాలు త్వరితగతిన వస్తున్నాయన్నారు. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, తదితర వాటితో చేసిన ఆహార పదార్థాలను తినడం వలన ఆరోగ్యం సమకూరుతుందన్నారు.

## సచివాలయాలకు చిత్రపటాల బహూకరణ



**తంబళ్లపల్లె, జులై 10, ప్రభాతవార్త:**

మండలంలోని కోసువారిపల్లె, పరసతోపు పంచాయతీ సచివాలయ భవనాలకు స్థానిక తెదేపా నాయకులు సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొనెదెల పవన్‌కల్యాణ్‌ల చిత్ర పటాలను బహూకరించారు. బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మహిళా నేత సిద్దమ్మ, టీడీపీ నాయకులు సచివాలయ కార్యాలయంలో స్వీట్లు పంచిపెట్టి చిత్ర పటాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా పాలన గాడి తప్పిందని ఎక్కడ చూసినా అవినీతి, అరాచక, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. చంద్రబాబు పాలనలో ప్రతి ఒక్కరికి నిష్పక్షపాతంగా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, జయరాంరెడ్డి, కృష్ణమూర్తి, సోమశేఖర్, నాగరాజు, కవిత, మురళీ, మహేష్, రాజారెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులకు

## లయన్స్ డిస్ట్రిక్ట్‌లో వరించిన పదవులు

**రాయచోటి, జులై 10, ప్రభాతవార్త:**





లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులలో డిస్ట్రిక్ట్ గ్లోబల్ మెంబర్‌షిప్ టీం (జీఎంటీ) కోఆర్డినేటర్‌గా వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి, జోన్ ఛైర్మన్‌గా మాజీ అధ్యక్షుడు లయన్ షేక్ మహ్మద్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ పీఎంజేఎఫ్ లయన్ ఎం.గౌతమ్ నియమించడం జరిగిందని అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి తెలిపారు. అనంతరం లయన్ హరినాథ్‌రెడ్డి, లయన్ షేక్ మహ్మద్ మాట్లాడుతూ మాకు 2024-25 సంవత్సరానికి ఇచ్చిన పదవులకు న్యాయం చేకూరుస్తామని డిస్ట్రిక్ట్‌లో ఉన్న అన్ని క్లబ్ వారితో పరస్పర సంబంధాలు పెట్టుకొని వారితో కలిసి ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు ముమ్మరంగా చేసి ఇంటర్నేషనల్‌లో డిస్ట్రిక్ట్316 జేకి మంచి గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని అలాగే మమ్మల్ని నమ్మి మాకు ఈ పదవులు ఇచ్చిన డిస్ట్రిక్ట్ గవర్నర్ పీఎంజేఎఫ్ లయన్ గౌతమ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## గ్రామాల్లో చిరుధాన్య విప్లవం



**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేలమంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.** జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది.

కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్యర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్సతో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహా అన్ని రకాల వంటలూ చేసు కోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘన్‌పూర్ తెప్పించుకుంటున్నారు. సొంతంగా గిర్నీలు, మరమిల్లులు ఏర్పాటు చేసుకుని చిరుధాన్యాలని మర పట్టిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి బయటకన్నా పది రూపాయలు తక్కువకే పిండి, రవ్వ అమ్ముతు న్నారు. ప్రస్తుతం వీరు 75 గ్రామాల్లో ప్రతి నెలా జొన్న, రాగి, సజ్జ పండి, రవ్వలతోపాటు గోధుమలను విక్రయిస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు. ఇంతకీ వీళ్ల ప్రయాణం ఎలా ప్రారంభమైందంటే 22 ఏళ్ల నక్రితం గ్రామీణ మహళల శక్తిని ప్రపంచానికి చాటేందు వెంకటస్వామి స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 12 మంది సభ్యులతో కాకతీయ మహిళా మాక్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా నెలకు రూ.పది నుంచి రూ.50 వరకు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడ్డారు. క్రమంగా వీళ్ల పొదుపు కోట్ల రూపాయలకు చేరుకుంది. అలా అలా ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందుతూ 75 ఊళ్లలో 5200 మంది సభ్యులు ఈ సంఘంలో చేరారు. పొదుపు సొమ్ముతో మొదట వీళ్లు ఒక సూపర్ మార్కెట్ ప్రారంభించారు. ఆ తరవాత వ్యాపారంలో చురుకుగా ఉండేందుకు కంప్యూటర్ శిక్షణ తీసుకున్నారు., 2018లో సేంద్రియ కూరగాయలు పండించి హైదరాబాద్‌కు మొత్తంలో ఎగుమతి చేసేవారు. సంఘంలోని ఒంటరి మహిళలువడ్రంగం పనిలో శిక్షణ తీసుకున్నారు.గుమ్మాలు, కిటికీలు, డైనింగ్ టేబుళ్లు కంప్యూటర్ టేబుల్ చేసి ఉపాధి పొందుతున్నారు. అలా అంచెలంచెలుగాఎదుగుతున్న ఈ సంఘం ప్రస్తుతం చిరుధాన్యాల ఉత్పత్తులతోనూ దూసుకెళ్లోంది.

## మంత్రిని కలిసిన మోడల్ స్కూల్ సిబ్బంది

**సంబేపల్లె, జులై 10, ప్రభాతవార్త:**

రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం సంబేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి బొకే, శాలువాతో సన్మానం చేశారు. రాయచోటి నుంచి సంబేపల్లి పాఠశాల వరకు వచ్చే ఆర్టీసీ బస్సును రౌతుకుంట వరకు పొడిగించాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి వెంటనే స్పందించి డీఎంతో మాట్లాడి వెంటనే బస్సు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆదర్శ పాఠశాల సొంత భవనం కొరకు ప్రభుత్వం మోటకట్ల వద్ద మంజూరు చేసిన స్థలంలో పునాదుల దశలోనే భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, ముందు లాగానే ఈ సంవత్సరం కూడా పదో తరగతిలో, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రేషన్ సరఫరాలో భారీ మోసం

- తూకాలు తక్కువగా ఉంటే వెనక్కు పంపండి



**పులివెందుల, జూలై 10, ప్రభాతవార్త ః**

రాష్ట్రంలో పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ సరఫరా చేస్తున్న గుత్తేదారులు తక్కువ తూకాలు ఇచ్చి భారీ మోసం చేస్తున్నారని, తూకాలు తక్కువగా ఉంటే వెనక్కు పంపాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రేషన్‌గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న బియ్యం బస్తాలను తూకాలు వేయగా ప్రతి బస్తాలో కేజీ నుండి ఒకటిన్నర కేజీ వరకు తూకాలు తక్కువగా వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ సరఫరా చేసే సంస్థలు తక్కువ తూకాలతో పంపడం జరుగుతోందని, గత ఐదు సంవత్సరాల నుండి పౌర సరఫరాల శాఖలో భారీగా మోసాలు జరిగాయన్నారు. రేషన్‌డీలర్లు తక్కువ తూకాలు ఉంటే తీసుకోకూడదని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కానీ, తమ దృష్టికి కానీ తీసుకువస్తే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

**- స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తాం ః**

పులివెందులలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి కల్పించడానికి ప్రయత్నిస్తామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నూతన భవనాలను నిర్మించిందని, కానీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. దీని ద్వారా పులివెందుల ప్రాంతానికే కాకుండా రాయలసీమ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వీలుగా అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైసూరారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.



## పుస్తక పఠనం మంచిదే ..

**కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు.**



**అవేంటంటే..**

✦ పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.

✦.విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి పయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్చారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.

✦ చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టి చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటూన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టకు ముక్కా వరలక్ష్మీ భూమి పూజ



**చిట్వేలి, జులై 10, ప్రభాతవార్త:**

చిట్వేలి మండల పరిధిలోని నక్కలపల్లి పంచాయతీలో బుధవారం ఉదయం గ్రామస్థుల ఆహ్వానం మేరకు రైల్వేకోడూరు టీడీపీ బాధ్యులు ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తిని ప్రపంచానికి చాటిన నందమూరి తారక రామారావు ఎప్పటికి తెలుగు ప్రజల గుండెల్లో కొలువు ఉంటారన్నారు. ఇట్టి మహోన్నత కార్యక్రమంలో పాల్గొనడం మహాభాగ్యంగా భావిస్తున్నానని తెలిపారు. తదుపరి చిట్వేలి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంను పర్యవేక్షించి ప్రయాణికులకు మెరుగైన వసతులను కల్పించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దిన చంద్రమోహన్, బుంగటావుల ప్రభాకర్, గిరిబాబు, నకుల్, తుంగా నవీన్, దశరథ, వెంకటాద్రి, రామయ్య, రత్నం, కాకర్ల సుబ్బరాయుడు, బాలు, రామాంజులు, కాకర్ల నాగార్జున, కోటి, కాటూరి నరసింహ, ఆకేపాటి వెంకటరెడ్డి, తుంగా దినేష్, గొబ్బిల చంగల్ రాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కా రజనీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, బండారు మహేష్ పాల్గొన్నారు.

### 25 సంవత్సరాల క్రితం కువైట్‌కు వెళ్లి...

## అనారోగ్యంతో దళిత మహిళ మృతి

**రాజంపేట అర్బన్, జూలై 10, ప్రభాతవార్త:**

పొట్టకూటి కోసం కువైట్‌కు వెళ్లింది. కుటుంబాన్ని జీవితాన్ని ధారపోసింది. జన్మభూమికి తిరిగి రాలేకపోయింది. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. నిరక్షరాస్యత శాపంగా మారింది. కువైట్‌లో ఉండేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఫలితంగా అక్కడి నుంచి రాలేకపోయింది. అక్కడే భయపడుతూ జీవనం కొనసాగించింది. చివరకు గడియలు కూడ అక్కడే ముగిశాయి. చివరి చూపులు కూడ కుటుంబ సభ్యులకు దక్కలేదు. మృతదేహం తీసుకొచ్చేందుకు ముఖ్యంగా కష్టమైన పరిస్థితులు. పేదరికం శాపంగా మారింది. పరాయి గడ్డపైనే అంత్యక్రియలు జరిపేందుకు ఓ మానవతా మూర్తి సహకరించడంతో సాంప్రదాయ బద్ధంగా నైనా అంత్యక్రియలు పూర్వయ్యాయి. వివరాల్లోకి వెళితే...అన్నమయ్య జిల్లా నందలూరు మండలం లేబాక అరుంధతి వాడకు చెందిన లేబాక సుబ్బ నరసమ్మ 25సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన కువైట్‌కు వెళ్లింది. అకామా లేక ఎలాంటి ఆధార పత్రాలు లేక అక్రమంగా నివసిస్తూ జీవిస్తున్న నేపథ్యంలో గత నాలుగు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతోంది. స్థానిక తెలుగు వారి ద్వారా ఈ విశయం పెనగలూరుకు చెందిన ప్రవాసాంధ్రుడు జిలకర మురళికి తెలిసింది. కువైట్‌లోని ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గత నెల 17వ తేదిన సుబ్బనరసమ్మ మరణించింది. ఈ విశయాన్ని తెలుగు తేజం జిలకర మురళీ రాయల్‌కు తెలిపింది. వారి కుటుంబసభ్యులకు విశయాన్ని తెలియజేసి ఆమెకు సరైన ఆధారప్రతాలు లేకపోవడంతో ఇండియాకు పంపలేని పరిస్థితిలో వారి కటుంబ సభ్యులు ఆదేశాలు మేరకు మన ఎంబసి అధికారులు సహకారంతో కువైట్‌లోనే దహణ సంస్కారాలు మురళీ దగ్గరుండి నిర్వహించారు. అక్కడ నుండి చివరి చూపును కుటుంబసభ్యులకుఎ వీడియో కాల్ ద్వారా చూపించి కనీసం అంతిమ సంస్కారాలు చూసే భాగ్యాన్ని కల్పించారు. ఇలాంటి పరిస్థితి మరొకరికి కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

**రామాపురం, జులై 10, ప్రభాతవార్త:**



మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లెలో మూతపడిన పాఠశాల భవనాన్ని స్థానిక వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దారు శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతరెడ్డిలు బుధవారం చెరువు ముందరపల్లెకు వెళ్లి అంగన్‌వాడీ పాఠశాల స్థలాన్ని పరిశీలించి ఆక్రమణకు గురైన పాఠశాల భవనాన్ని స్వాధీనం చేసుకొని అంగన్‌వాడీ సిబ్బందికి అప్పజెప్పారు. ఆయన వెంట వీఆర్వో వెంకట సుబ్బయ్య, సర్వేయర్ మణికంఠ, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**రామాపురం, జులై 10, ప్రభాతవార్త:**

మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఉన్న వంకలో అక్రమంగా ఎలాంటి పర్మిట్లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను బుధవారం రామాపురం పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని సంబంధిత అధికారులు సంపాదించి ఇసుకను రవాణా చేస్తే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## ఆర్డీ పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖలో పదోన్నతులు ఇవ్వండి

**కడప కార్పొరేషన్, జులై 10, ప్రభాతవార్త:**



ఏఎన్ఎంలను ఎంపీహెచ్ఎస్‌గా ఎంపీ హెచ్‌లను పీహెచ్ఎన్‌లగా వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ఏపీఎన్‌జీజీఓఎస్ రాష్ట్ర సహాధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, నంద్యాల ఎన్‌జీజీవో నాయకులు హుసేన్‌రెడ్డి, మణిశంకర్‌రెడ్డిలు కడప రీజినల్ డైరెక్టర్ డా.అరుణకుమారిని కోరారు. ఈ మేరకు బుధవారం కడప రీజినల్ డైరెక్టర్ డా.అరుణకుమారిని ఏపీఎన్‌జీవోఎస్ నాయకులు కలిశారు. పదోన్నతులపై చర్చించారు. ఆర్డీ రత్నకుమారి మాట్లాడుతూ త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

## జగన్ పాలనలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

**కడప కార్పొరేషన్, జులై 10, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇసుక పథకాన్ని అమలు చేస్తుంటే వైసీపీ నాయకులకు వణుకు పుట్టిందని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరీఫుల్లా అన్నారు. బుధవారం కడప నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు మాట్లాడుతూ ఉచిత ఇసుక పేరుతో టీడీపీ వసూళ్లకు పాల్పడుతుందని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులు ఇష్టానుసారంగా ఇసుకను వేరే రాష్ట్రాలకు అమ్ముకొని కోట్ల రూపాయలకు దండుకున్నారని ఆరోపించారు. పేదలకు చంద్రబాబు ఉచితంగా ఇసుక ఇస్తుండడంతో వైసీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.

## జిల్లా కలెక్టరును కలిసిన ఏపీఎన్‌జీజీవో నాయకులు



**కడప కార్పొరేషన్, జులై 10, ప్రభాతవార్త:**

ఏపీఎన్‌జీజీవో కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అందరం కలిసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు సేవ చేద్దామన్నారు. ఉద్యోగుల సమస్యలుంటే పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీజీవోస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, బాల పుల్లయ్య, రాజశేఖర్, పోల్‌రెడ్డి, నరసింహారెడ్డి, మరియు సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, గౌరీ, జ్యోతి, సుహాసిని, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ట్యూటోరియల్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోండి

**గాలివీడు, జులై 10(ప్రభాతవార్త):**



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ ట్యూటోరియల్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎంఈఓ పిల్లి నాగరాజును కోరారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సెక్షన్ 28, ఆర్టీఈ యాక్ట్ 2009 ప్రకారం ఏ ఒక్క ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎలాంటి ట్యూషన్స్ లేదా ట్యూటోరియల్స్ నిర్వహించకూడదన్నారు. అయితే గాలివీడులో మాత్రం కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ట్యూటోరియల్స్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు తంగాల మహేష్, అయాజ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త ఫ్లేయర్లతో క్రీమ్ స్టోన్ ఐస్‌క్రీం పార్లర్

**కడప వైద్యవిభాగం, జులై 10, ప్రభాతవార్త:**

సరికొత్త ఫ్లేవర్లతో క్రీమ్ స్టోన్ ఐస్‌క్రీం పార్లర్‌ను కేసర విద్యా సంస్థల ఛైర్మన్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి (నాని) ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరుణ్, హరిలు కడప నగరంలో ఇటువంటి ఐస్‌క్రీమ్ పార్లర్ ప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రొపైటర్లు మాట్లాడుతూ మా ఐస్‌క్రీం పార్లర్‌లో సరికొత్త ఫ్లేవర్ల సీజన్ వారీగా అన్ని వెరైటీ రుచులతో ఐస్‌క్రీం, నట్స్, ఓవర్‌లోడు, విల్లీ వంక, కలాజామూన్, తదితర రకాల స్టోన్ క్రీం ఐస్‌క్రీం పార్లర్లలో లభించును అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకొని మా వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్లు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, కిరణ్, మధుసూదన్, కమల్, మస్తాన్, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## హజ్‌హౌస్‌ను మరలా ప్రారంభించండి

**కడప వైద్యవిభాగం, జులై 10, ప్రభాతవార్త:**



నగర శివార్లలో ఉన్న హజ్ హౌస్‌ను మరలా ప్రారంభించాలని మైనార్టీ నాయకులు ఆర్కే రాయల్ కరీముల్లా, జీకే ఖాదర్ బాషా కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డికి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పకుండా మరలా హజ్‌హౌస్‌ను ప్రారంభించడానికి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి





**మదనపల్లెక్రైం, జూలై 10 ప్రభాతవార్త :**

మదనపల్లె సర్వజన బోధన ఆస్పత్రిలో పారిశుద్ధ్యం నిర్వహణపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మదనపల్లె ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడికల్‌కళాశాల నిమత్తం ఆస్పత్రిలో చేపట్టిన భవననిర్మాణ పనులు అస్తవ్యస్థంగా వున్నాయన్నారు. పనులను నాసిరకంగా చేయటం జరిగిందన్నారు. ర్యాంప్‌నిర్మాణంను సగంలో వదిలేశారని, వారం రోజుల్లో ర్యాంప్ నిర్మాణం పూర్తిచేయకుంటే సంబంధింత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించామన్నారు. ఎక్కువగా రోగులకు ఇక్కడ వైద్యం చేయకుండా తిరుపతి, బెంగళూరు పట్టణాలకు రెఫర్‌చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై అలా చేస్తే వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి పనిచేసే స్టాఫ్ నర్సులు, సెక్యూరిటీ గార్డ్స్‌కు గత 5 నెలలుగా వేతనాలు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వంలో చర్చించి వీలైనంత త్వరగా వేతనాలు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా ఎన్‌టిఆర్ వైద్యసేవలు సక్రమంగ అమలైయ్యాలా చూడాలని జిల్లా ఆధికారి డాక్టర్ లోకవర్ధన్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, ప్రిన్సిపాల్ జమున, సిబ్బంది పాల్గొన్నారు.

## అతిసారా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కలికిరి, జులై 10, ప్రభాతవార్త:**

కలికిరి మండలంలోని పంచాయతీలలోని ప్రజలు అతిసారా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.చిన్నరెడ్డప్ప ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని రంగనాథపురం, మహల్ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా.చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ అన్నం తినేముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. నీటిని కాచి చల్లార్చుకొని తాగాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి వేడి చేసి ఆనీటిని 24 గంటల లోపు తాగాలన్నారు. అతిసార వ్యాధి భారిన పడిన వారు జింక్ మాత్రలు 200 ఎంజీ 14 రోజుల పాటు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ పరీషా, ఏఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికల తయారీలో అధికారులు బిజీ

**కలికిరి, జులై 10, ప్రభాతవార్త:**

రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీలలో అధికారులు బిజీ బిజీగా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా మంచినీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని అలాగే గ్రామాల్లోని ప్రతి రక్షిత మంచినీటి ట్యాంక్‌కు మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్కడా పైపులైను మరమ్మతులకు గురై ప్రజలు అంటురోగాల బారిన పడకూడదని రాష్ట్ర డిప్యూటీ సీఎం కొనిదెల పవన్ కల్యాణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు కలికిరి మండలంలో ఎంపీడీవో రామకృష్ణ పంచాయతీ అధికారులను అప్రమత్తం చేసి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించి పర్యవేక్షిస్తున్నారు. దీంతో బుధవారం మండలంలోని పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోకి వెళ్లి ఏ గ్రామంలో మంచినీటి సమస్య ఉంది, ఎక్కడెక్కడ కొత్త బోర్లు వేయాలి, ఎక్కడ పైపులైన్లు ఏర్పాటు చేయాలి, మంచినీటి ట్యాంకులకు మంచినీరుసరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మమేకమై అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులతో గ్రామాల్లో సందర్శించి మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అధికారులు గ్రామాల్లోకి వచ్చి సమస్యలపై ప్రజలతో మమేకం కావడంతో కొత్త ప్రభుత్వంపై అదే విధంగా సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతో తమ సమస్యలు పరిష్కారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయని ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. పంచాయతీలలో సర్పంచులు, తమ పంచాయతీలకు రావాల్సిన నిధులు కూడా త్వరలో మంజూరు కావడం జరుగుతుందని దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత సేవలు అందించాలని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ కొత్త ప్రభుత్వం రాకతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## కత్తి మహేష్‌కు ఘన నివాళులు

**పీలేరు, జూలై 10 ప్రభాతవార్త:**

కత్తి మహేష్ మూడవ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీయస్ సీనియర్ నాయకులు ముల్లంగి చంద్రయ్య ఆధ్యక్షతన పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కత్తి మహేష్‌కు నివాళులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీయస్ నాయకులు సద్దల ప్రేమ్‌కుమార్ మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు గుర్రం నారాయణ సీపీఐ నాయకులు టీఎల్ వెంకటేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు అమతతేజ, బీఎస్ఎఫ్ నాయకులు భానుప్రకాష్, మాలమహానాడు నాయకులు సుభాష్, గట్టప్ప హాజరై కత్తి మహేష్ చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కత్తి మహేష్ సినీ ఇండస్ట్రీలో కులం అనే రక్కసితో కొట్లాడి పోరాడి మూఢనమ్మకాల మీద ఒక యుద్ధం చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్, ఎంఎస్‌పీ నాయకులు తిమ్మయ్య, బాలరాజు, అశోక్, శ్రీకాంత్, డాన్‌కుమార్, రాజశేఖర్, శేషాద్రి రెడ్డిశేఖర్, మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు రామంజులు, మల్లికార్జున, రమణ, శ్రీరాములు, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**పీలేరు, జూలై 10 ప్రభాతవార్త:**

గిరిజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జిగా గూండా వీరనాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషదాయకమని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు నాగేంద్రనాయక్ చౌహాన్ పత్రికా ప్రకటనలో తెలిపారు. గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పూజారి రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జిగా వీరనాగయ్యను ఎన్నుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్రంలోని గిరిజన ప్రజలకు గిరిజన విద్యార్థులకు వారి సమస్యల పట్ల పనిచేయవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంజినేయులు, పోలూరి రమేష్, నాగన్నలు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారమే ధ్యేయం



**పీలేరు, జూలై 10 ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజినేయమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ట్రాన్సుకో డివిజన్ కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అదాలత్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మాట్లాడుతూ మొత్తం ఐదు సమస్యలు తమ దృష్టికి రాగా నాలుగు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. మరో సమస్య త్వరలో పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనికుమార్, స్వతంత్ర్య సభ్యులు ఈశ్వరమ్మ, ఇన్‌చార్జి ట్రాన్సుకో ఈఈ ఎం. మునిచంద్ర ఏడీఈ సుధాకర్ అధికారులు వినియోగదారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**వేంపల్లె, జూలై 10, ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు షబ్బీర్ అన్నారు. వేంపల్లెలోని పక్కీరుపల్లె సచివాలయం, తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. డ్రైనేజి వ్యవస్థ సరిగా లేదని, గతంలో ఇళ్లు మంజూరు కాలేదని, చెత్తాచెదారం అస్తవ్యస్తంగా తయారైందని, పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపచేస్తామని ఆయన హామీఇచ్చారు. అక్కడ ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సమీపంలో చెత్తాచెదారం వేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి వెంటనే అక్కడ ఉన్న చెత్తాచెదారాన్ని ఎత్తివేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోటూరు నాగభూషణం, భాస్కర్, లాడెన్, చావలి నాగేష్, మాబూవలి, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.



## దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి

**వేంపల్లె, జూలై 10, ప్రభాతవార్త :**

విద్యార్థులు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. వేంపల్లె మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం దోమల నివారణ కోసం రసాయనాలు పిచికారి చేయించారు. దీంతో దోమలు వాలితే చనిపోతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగస్వర్ణ, హాస్టల్ ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్త రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలకు వైద్యపరీక్షలు

**రామసముద్రం, జులై 10 ప్రభాతవార్త :**



మండల కేంద్రలోని పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వఅభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వందమంది గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ లీలా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు బీపి, షుగర్, హెచ్‌బి, మూత్ర పరీక్షలు, హెచ్ఐవి వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లీలా వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లో మీడియా పబ్లిసిటి చేస్తోందని చెప్పడం సిగ్గుచేటు

**కడప వైద్యవిభాగం, జులై 10, ప్రభాతవార్త:**



మేయర్ సురేష్‌బాబు ఎల్లో మీడియా పబ్లిషిటీ చేస్తోందని చెప్పడం సిగ్గుచేటని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని హరితవర్స్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఇసుకను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించారని ఇసుకపైన మేయర్ సురేష్‌బాబు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ప్రజలు అధికారంలోకి తెచ్చారని ఆయనను విమర్శలు చేయడం శోచనీయమన్నారు.

## మాల మహానాడు ర్యాలీని జయప్రదం చేయండి

**కడప వైద్యవిభాగం, జులై 10, ప్రభాతవార్త:**

రాష్ట్ర మాల మహానాడు రామాజీ ఇమ్మానియేలు వర్గం తరుపున ఈనెల 29న జరగనున్న ర్యాలీ, ధర్నాకు మాలలు అందరూ విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం కాగితాలపెంటలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 29న ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ అనంతరం నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల నిర్వహించాల్సిన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల ఏసోబు, కడప జిల్లా అధ్యక్షులు ఉల్లి కిరణ్‌కుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు సుద్దపల్లి మురళీప్రసాద్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి మురళీప్రసాద్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి ఎస్.అరుణ్‌కుమార్, కడప జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.పుల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసిలో ఆదర్శ ఉద్యోగులకు బహుమతులు

**మదనపల్లె, జులై 10 ప్రభాతవార్త :**



ఆర్టీసి వన్‌డిపోలో ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేసినట్లు డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్‌రావు ముఖ్యఅతిథులుగా విచ్చేయగా ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేసినట్లు తెలిపారు. 2024జూన్ నెలలో డిపో యొక్క ఓఆర్ 70 శాతం సాధించి రీజియన్ నందు మొదటిస్థానం, కెఎంపిఎల్ 5.39 సాధించి రీజియన్ నందు రెండవ స్థానం వచ్చినందున అందరిని అభినందించడం జరిగిందన్నారు. మొదటి బహుమతి కేసిమస్తాన్, రెండవ బహుమతి జి.కమలమ్మ, మూడవ బహుమతి జి.అమరావతిలకు ప్రధానం చేసినట్లు తెలిపారు. వీరితో పాటు ఎం.నాగరాజు, పివిబి.రెడ్డి, బిసి.నాయక్‌లకు ప్రశంసాపత్రాలు అందిజేసినట్లు తెలిపారు.

## స్థలం ఆక్రమించారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**మదనపల్లె, జులై 10 ప్రభాతవార్త :**



తన స్థలాన్ని స్మశానానికి అక్రమంగా ఆక్రమించారని ప్రభుత్వ ఉద్యోగి ఏసువర్ధన్‌రావు బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. రూరల్ మండలం సిటిఎం క్రాస్ రోడ్డు నందు సర్వేనెంబర్ 810లో 99సెంట్లు భూమి కలదని, ఈ స్థలంలో గతంలో అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా స్థలాన్ని ఆక్రమించి స్థలాలను పాతేందుకు పన్నాగం పొందారన్నారు. తన స్థలంలో సర్వే చేయించి న్యాయం చేయాలని ఆయన ఎమ్మెల్యేకు విన్నవించారు. సిటిఎం గ్రామంలో గత అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలు సైతం చేశారని ఆయన విన్నవించారు. న్యాయం చేయాలని కోరారు.

## బీసీజి టీకా సురక్షితం

**మదనపల్లె, జులై 10 ప్రభాతవార్త :**



క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ టిబి ముక్తభారత్ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని టిబీ యూనిట్ సూపర్ వైజర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో సిబ్బందికి బీసీజి వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనుల బీసీజి టీకా సురక్షితమని, ఎటువంటి అపోమలు లేవని ప్రతి ఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకొని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని కోరారు. 18ఏళ్ళు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్‌వ్యాధిగ్రస్తులు, శరీర ద్రవ్యరాశి సూచిక తక్కువ ఉన్నవారు ఈ టీకాలను తప్పకుండా వేయించుకోవాలన్నారు.

## మినికి సచివాలయానికి ముఖ్యమంత్రి ఫోటోలు

**రామసముద్రం, జులై 10 ప్రభాతవార్త :**



మండలంలోని మినికి పంచాయితీ సచివాయాలయానికి ముఖ్యమంత్రి చంద్రాబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాష చిత్రపటాలను మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథరెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామనాథ్, క్రిష్ణప్ప, మునిరాజు, బాలరాజు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి మహిళలు దీలుబోణాలు

**రామసముద్రం, జులై 10 ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని గాజులనగర్‌లో కొలువు ఉన్న కనకదుర్గమ్మ గంగజాతర బుధవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ జాతరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు గ్రామస్థులు భారీగా ఏర్పాటు చేశారు. ఉదయం అర్చకులు అనీల్, శివ, రాజేష్‌లు కలిశారాదన, హోమాలు చేశారు. రెండు రోజులు అనంతరం అమ్మవారిని ఊరేగించడం జరుగుతుందని తెలిపారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాం



**రాయచోటి, జులై 10, ప్రభాతవార్త:**
అవసరం నిమిత్తం వచ్చే ప్రతి ప్రజానీకానికి జవాబు దారి తనంగా సచివాలయం సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి, రాయచోటి పట్టనం 12వ వార్డులో సచివాలయం (మార్పు) రపారంభోత్సవం కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు శివగంగిరెడ్డి, టీడీపీ నేత రామ్మోహన్‌రెడ్డి, ఇతర కూటమి నేతలతో కలిసి టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్ పాల్గొన్నారు. వారికి స్థానిక కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా సచివాలయాన్ని మార్పు చేయడం జరిగిందే తప్ప ఎటువంటి రాజకీయ కోణాలు లేవన్నారు. సమూలమైన మార్పు కోసం కూటమి ప్రభుత్వానికి 175 స్థానాలకు 164 స్థానాలను ప్రజలు గెలిపించుకున్నారన్నారు. 20 సంవత్సరాల ఫలితానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం మన రాయచోటి ప్రజల అదృష్టమన్నారు. మంత్రి సహకారంతో సమస్యలు పరిష్కరించుకుని రాయచోటి అభివృద్ధి పథంలో నడిపించే విధంగా మనందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు.

## స్నేహితుడితో కలిసి
## సొంత బావమరిదిని హత్య చేసిన బావ



**రాయచోటి, జులై 10, ప్రభాతవార్త:**
సొంత బావ మరిదిని హత్య చేసిన ఘటన రాయచోటిలో చోటు చేసుకుంది. రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు రాయచోటి టౌన్ రెడ్డీస్ కాలనీలోని సిద్దిక్ మసీదు డౌన్ వీధిలో నివాసం ఉన్న షేక్ అబ్దుల్ రహీం గత కొంత కాలంగా రాయచోటి టౌన్ ఠానా సమీపంలో గల మదరసా ఎదురుగా ఉన్న సందులో కేజీఎన్ చికెన్ సెంటర్‌లో కూలి పని చేస్తూ ఉండి సొల్యూషన్ పీల్చడం, మద్యం తాగడం వంటి చెడు అలవాట్లకు బానిసై గత కొంత కాలంగా తన తల్లిని, సొంత అక్కను వేధిస్తూ డబ్బులు ఇవ్వమని వారిని నానా ఇబ్బందులు పెడుతుండేవాడు. అతని వేధింపులు తట్టుకోలేక అబ్దుల్ రహీం సొంత పెద్ద అక్క భర్త అయిన షేక్ ఇర్షాద్ అలీ మరియు సూరాకు చెప్పగా అతను చాలా సార్లు అబ్దుల్ రహీంను మందలించినా మార్పు రాలేదు. చేది లేక ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొని ఈ నెల 7వ తేదీ రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇర్షాద్ అలీ తన చిన్ననాటి స్నేహితుడైన సాయికుమార్‌కు విషయం చెప్పి అతనితో కలిసి అబ్దుల్ రహీం ఇంటికి పోయి అతనిని తీసుకొని గున్నికుంట సమీపంలో గల సమాధుల వద్ద చాకుతో కొంతు కోసి హత్య చేసి శవాన్ని అక్కడే కంప చెట్లలో పడేసి ఇద్దరు పరారయ్యారు. మృతుడు అబ్దుల్ రహీం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముద్దాయిలను బుధవారం వీరబల్లి రింగ్ రోడ్డు అరెస్టు చేసి వారి వద్ద నుంచి చాకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముద్దాయిలను రాజశ్రీ కోర్టులో హాజరుపరచడం జరిగిందన్నారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలం, సిబ్బంది కృషి చేశారు.

## టిడిపి కష్టకాలంలో
## జెండా మోసిన కార్యకర్తలను గుర్తించాలి

**ప్రొద్దుటూరు, జులై 10, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రేస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుండి తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నో ఇబ్బందులు గురి చేసిందని అలాంటి కష్ట కాలంలో తెలుగుగేశం పార్టీ జెండా మోసిన కార్యకర్తలను గుర్తించి సముచిత న్యాయం చేయాలని ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమరావతిలో ఆయన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను నేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సంధర్భంగా గత ఐదేళ్ల వైసిపి రాక్షస పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎన్నో కష్టాలను ఓర్చి తెలుగుదేశం పార్టీ జెండాను నిలబెట్టిన నాయకులకు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులలో సముచిత న్యాయం కల్పించాలని కోరారు. అదే సమయంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అప్పటి ఎంఎల్‌ఏ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతిపై మరియు అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని లోకేష్‌ను ప్రవీణ్ కోరారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని
## సిడిపిఓకి వినతిపత్రం

**ప్రొద్దుటూరు అర్బన్, జులై 10, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు అంగన్వాడిల సమస్యలు పరిష్కరించాలని రూరల్ ఐసీడీఎస్ అధికారికి సీఐటీయూ జిల్లా కమిటి వినతిపత్రం ఇచ్చింది. ఈ సంధర్భంగా సిఐటియూ జిల్లా కమిటి సభ్యులు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదన్నారు. సుప్రిం కోర్టు 26000 వేతనాలు ఇవ్వాలని అంగన్వాడీలను పర్మిట్ చేయాలని గ్రాడ్యుటి అమలు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తా ఉంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. బిజెపి ఏ జీఓలు తీసుకువచ్చిన దానికి ముందుండి మద్దతు తెలపడం మన రాష్ట్రంలో ఉన్న వైసిపి కానీ అధికారంలో ఉన్న టిడిపి మద్దతు తెలుపుతున్నాయని ఎన్నికల ముందు అనేక రకాలుగా వాగ్గానాలు చేసి వాటిని అమలు చేసే దిశగా ఆలోచన చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, సిఐటీయూ కార్యదర్శి రాఘవ, అంగన్వాడి యూనియన్ లీడర్లు గీత, నాగవేణి, సువార్తమ్మ, అంజనమ్మ, రామసుబ్బమ్మ, పద్మావతి, ఎక్సిబా పాల్గొన్నారు.



## మొలకలచెరువులో ఇసుక డంప్‌లు సీజ్





**మొలకలచెరువు, జూలై 10 ప్రభాతవార్త :**
వైసిపి ప్రభుత్వ హయంంలో భారీగా నిల్వలు వుంచిన ఇసుక డంప్‌లను అధికారులు సీజ్ చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇసుకను పోగు చేసినట్లు సమాచారం. పిటిఎం మండలం టి.సదుం సమీపంలోని సగమేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పాపాఘ్ని నుంచి ఇసుకను పిఎల్ఆర్ పేరున్న టిప్పర్లతో మొలకలచెరువు మండలం రెడ్డివారిపల్లి సమీపంలో నిల్వలు వుంచినట్లు అధికారులు గుర్తించారు. గత ప్రభుత్వం హాయంలో కడప జిల్లాలోని గండికోట జలాలను మొలకలచెరువు, తంబళ్లపల్లి, పెద్దతిప్పసముద్రం మండలాల మీదుగా పులికల్లులోని హంద్రీ-నీవా కాలువకు అనుసంధానం చేసేందుకు నిధులు విడుదల కావడంతో హైదరాబాదుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ దక్కించుకుంది. అయితే పనులు మాత్రం పిఎల్ఆర్ కంపెనీ చెందిన వాహనాలతోనే చేస్తున్నారు. ఈ పనుల కోసం ఇసుకను తరలించి భారీగా నిల్వలు చేశారు. ప్రస్థుతం పనులకు ఆ ఇసుకను వినియోగించకపోవటంతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అదేశాలతో స్థానిక తహాశీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఈబీ సిఐ రామ్మోహన్, ఇరిగేషన్ డీఈ సారధి, అధికారులు సుప్రజ, సర్వేయర్ దుర్గాదేవి, స్థానిక ఆర్ఐ వీరాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది చంద్రశేఖర్, రజిత తదితరులు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక 27,472 క్యూబిక్ మీటర్ల వున్నట్లు అంచనా చేస్తున్నారు.

## ప్రభుత్వ అధికారులు, సిబ్బంది
## ఎవరైనా తప్పు చేస్తే, అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదు

**మైదుకూరు రూరల్, జూలై 10, ప్రభాతవార్త:**
ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా తప్పు చేస్తే, అక్రమాలకు పాల్పడితే వదిలే ప్రసక్తే లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హెచ్చరించారు. బుధవారం మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ థామస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం కష్టపడి మండలాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు విలువలేదని కానీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి విలువ ఉంటుందని అన్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా అర్హత లేని వారికి పెన్షన్లు వచ్చాయని, అక్రమ పెన్షన్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిలో అక్రమాలు జరిగాయని బోగస్ మస్టర్లు తయారు చేశారని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా 100రోజులు పని దినాలు చూపించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామానికి తప్పనిసరిగా స్మశాన వాటికలు అన్ని గ్రామాలలో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు తమ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులను నివేదిక రూపంలో చదివి వినిపించారు. ఎంపీడీఓ ఎం.ఫజుల్ రహిమాన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## డాక్టరేట్ అందుకున్న
## షాకీర్ ఖురేషికి ఘన సన్మానం



**ప్రొద్దుటూరు, జూలై 10, ప్రభాతవార్త:**
ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ ప్రతినిధుల చేతులమీదుగా డాక్టరేట్ అవార్డు అందుకున్న డాక్టర్ షాకీర్ ఖురేషికి బుధవారం స్థానిక దస్తగిరి పేటలోని తఖ్వా పాఠశాలలో ముస్లిం ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా డాక్టర్ చంద్రశేఖర్, ఇమామ్ హుస్సేన్, డాక్టర్ లియాఖత్ అలీ, టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు అక్రమ్, గౌసుల్, అజీమ్ పాల్గొని డాక్టర్ షాకీర్ ఖురేషి సేవలను కొనిఆడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## రవాణాశాఖ మంత్రికి ఘన స్వాగతం



**వేంపల్లె, జూలై 10, ప్రభాతవార్త :**
పులివెందుల నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వేంపల్లెలో టీడీపీ మైనార్టి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు ఎస్ఎండి షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పులివెందుల నుండి రాయచోటికి వెళ్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిలకు షబ్బీర్ చేతుల మీదుగా శాలువాలు కప్పి, పూల మాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తలతో మంత్రి కాసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యుడు దర్బార్, బక్ష, భాస్కర్, నాగిరెడ్డి, నాగభూషణం, సుబ్బరాయుడు, రామాంజినేయులురెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**ప్రొద్దుటూరు క్రైం, జులై 10, ప్రభాతవార్త:**



కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, అలాగే మౌలిక వసతులు కల్పించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని స్థానిక రాజుపాలెం మండల పరిధిలో ఉన్న వసతి గృమం విద్యార్థులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజుతో పాటు మహేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు బైకులు ఇవ్వరాదు

**ప్రొద్దుటూరు క్రైం, జులై 10, ప్రభాతవార్త:**
జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు బుధవారం ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ తల్లిదండ్రులను పిలిపించి మైనర్లకు బైకులు ఇవ్వరాదని కౌన్సెలింగ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు ముద్దాయిలు అవుతారని హెచ్చరించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు.



## మంత్రి మండిపల్లికి ఘన స్వాగతం



**పులివెందుల, జూలై 10, ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారి పులివెందులకు విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, రవాణాశాఖ, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో పులివెందుల తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బుధవారం పులివెందులలో జరుగుతున్న ఆరు రాష్ట్రాల సౌత్ జోన్ హాకీ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలను ప్రారంభించేందుకు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పులివెందులకు విచ్చేశారు. ఈ సందర్భంగా వేంపల్లె, వేములలో తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి బాణసంచా పేల్చి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుని అక్కడ విందు చేశారు. అక్కడ తెదేపా నాయకులు, పలు సంఘాల నాయకులు అందించిన అర్జీలను స్వీకరించారు. అనంతరం ధ్యాన్‌చంద్ క్రీడా మైదానం చేరుకుని ఆరు రాష్ట్రాల సౌత్‌జోన్ హాకీ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు. అక్కడ నుండి తెదేపా కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ తెదేపా నాయకులు మహబూబ్‌బాషా, మహిళా నాయకురాలు రజియా, తదితరులు శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయం నందు నాయకులు, కార్యకర్తల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం రాయచోటికి బయలుదేరి వెళ్లారు.

## ప్రభుత్వ భూమికి,
## ప్రైవేటు భూమికి తేడా తెలియదా

**సంబేపల్లె, జులై 10, ప్రభాతవార్త:**
15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పని చేసిన శ్రీకాంత్‌రెడ్డికి ప్రభుత్వ భూమి ఏదో ప్రైవేటు భూమి ఏదో తెలియక మా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మండల టీడీపీ నాయకులు నాగేశ్వర్ నాయుడు, కోటిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు విమర్శించారు. బుధవారం సంబేపల్లెలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మతి భ్రమించి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. సంబేపల్లె మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి అందులో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఉద్దేశం మంత్రికి ఉన్నదని టీడీపీ వారికి పంచిపెట్టే దానికి కాదన్నారు. మాన్యం భూములను కొల్లగొట్టి ప్రభుత్వ కార్యాలయాలకు మా నాయకులు సొంత భూములు దానం చేశారని మాజీ ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శెట్టిపల్లె గ్రామంలోని లక్ష్మీనరసింహా స్వామి మాన్యం భూములు 51 ఎకరాలు, జడ్పీటీసీ వారు చుక్కల భూములుగా మార్చారన్నారు. రాయచోటి నియోజకవర్గం కరువు ప్రాంతమని ఈ ప్రాంత అభివృద్ధి కోసం పరిశ్రమలు తెచ్చేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. అందులో సంబేపల్లె మండలంలో కానీ పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు యాదవ్, చిన్నప్ప, మట్టి వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సజ్జ పంట పరిశీలన

**పెండ్లిమర్రి, జులై 10, ప్రభాతవార్త:**
మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి జీపీ ఓబులేసు సజ్జ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మండల వ్యాప్తంగా 552 ఎకరాల్లో వరి, మినుము, సజ్జ, వేరుశనగ, కంది, చామంతి, ఉల్లి పంటలను సాగు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఏమైనా పంటలపై సందేహాలున్నా సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వస్తరణాధికారి గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.



## మంత్రి ఆదేశంతో
## వండాడి మీదుగా గాలివీడుకు బస్సు ప్రారంభం



**చిన్నమండెం, జూలై 10, ప్రభాతవార్త :**
రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశంతో బుధవారం నుండి రాయచోటి నుండి గాలివీడుకు వండాడి మీదుగా ఆర్టీసి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బస్సుకు పూజలు నిర్వహించారు. రాముడన్నకు ధన్యవాదాలు తెలిపారు. వండాడి మీదుగా బస్సు వెళ్లడం వలన ఈ మార్గంలో ఉన్న మూడు నాలుగు పల్లెల నుండి రాయచోటికి వెళ్లే ప్రజలకు విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## కొలువుదీరిన గంధపు పీరు

**చిన్నమండెం, జూలై 10, ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని జిల్లాలోనే అత్యంత ఘనంగా హిందూ ముస్లీం సోదరులు కలిసిన జరుపుకొనే మొహరం వేడుకలలో భాగంగా బుధవారం పీర్ల మకాన్ కమిటి పెద్దలు, కమిటి సభ్యులు గంధపు పీరును కొలువు తీర్చారు. అలాగే మూడు మకాన్‌లలో 35 భారా ఇమామ్ పీర్లను కొలువు తీర్చారు. 12వ తేదీన అగ్ని గుండాల, 13న చిన్న పిల్లలకు అటీలు, 14న సంతానం లేనివారు ముడుపులు కట్టుట, ఇమామ్ ఖాసీం పీర్ల మెరవణి, 15న హుసేని అలం పీర్లకు గంధం ఎక్కించడం, అగ్ని గుండాల కాల్చడం, 16న లాంగర్ల కార్యక్రమం, అన్నదానం, రాత్రి 7 గంటలకు పెద్ద దర్గా గురువు ఆరీఫుల్లా హుసేనిచే గంధం ఎక్కించడం, గంధపు పీరు మెరువని అత్యంత ఘనంగా జరుగుతుందని దర్గా కమిటి పెద్దలు తెలిపారు. గంధపు పీరు బాసికం, గంధపు పీరు మెరువనికి జిల్లా వాసులే కాక పక్క రాష్ట్రాల నుండి కూడా హిందూ ముస్లీం సోదరులు వేలాదిగా తరలివస్తారు. తొమ్మిదిరోజుల పాటు మండల కేంద్రంలో మొహరం వేడుకల సందడి నెలకొంది.

## అంగన్వాడి వర్కర్స్
## కోర్కెల దినోత్సవం సంధర్భంగా వినతిపత్రం



**ముద్దనూరు, జూలై 10, ప్రభాతవార్త:**
అంగన్వాడి వర్కర్స్ కోర్కెల దినోత్సవం సంధర్భంగా రాష్ట్ర కమిటి పిలుపుమేరకు ముద్దనూరు మండల పరిధిలోని అంగన్వాడి వర్కర్స్ వారి యొక్క ప్రధాన సమస్యలపై సిడిపిఓ ముంతాజ్ బేగంకు వినతిపత్రం బుధవారం నాడు అందజేశారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు సమ్మె కాలంలో అంగన్వాడి సిబ్బందికి ఇచ్చిన హామీలను ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం హామీలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సుప్రింకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేసి ఐసిడిఎస్‌ను మరింత బలోపేతం చేసి తెలంగాణ ప్రభుత్వం పెంచిన విధంగా అంగన్వాడి వర్కర్స్ యొక్క బడ్జెట్ పెంచాలని అంగన్వాడి మినీ వర్కర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడి సిబ్బందిపై రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఈ సంధర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంధాలయం తనిఖీ

**చాపాడు, జూలై 10, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన చాపాడులోని గ్రంధాలయాన్ని బుధవారం గ్రంధాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి, సభ్యత్వాలను పెంచాలని, సెస్ కలెక్షన్ వంటి వాటిపై దృష్టి సారించాలని గ్రంధాలయ అధికారి శివశంకర్ రెడ్డిని కోరారు. గ్రంధాలయ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## 12న మండల సమావేశం

**దువ్వూరు, జూలై 10, ప్రభాతవార్త:**
స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో ఈనెల 12వ తేదిన మండల ప్రత్యేక సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణ శ్రీ తెలిపారు. 12 వ తేది శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశంలో మండలంలోని వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ముఖ్యంగా తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, రెవెన్యూ తదితర అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.


వార్త



**రిపోర్టర్స్ కావలెను**

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

**అన్నమయ్య జిల్లా**
రాయచోటి కలెక్టరేట్, రాయచోటి అర్బన్, రాయచోటి రూరల్, చిన్నమండెం, గుర్రంకొండ, కలకడ, పెద్దమండెం, సుండుపల్లె, మంగంపేట, వాయల్పాడు, పెద్దతిప్పసముద్రం

**కడప జిల్లా**
కడప కలెక్టరేట్, కడప అర్బన్, వల్లూరు, చెన్నూరు, కాశినాయన, జమ్మలమడుగు అర్బన్, మైలవరం, యర్రగుంట్ల

మీ పూర్తి బయోడేటాతో 12వ తేది శుక్రవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలనీ, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086